నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, ఆదివారం 25 మే 2025 | SURYAPET

హైదరాబాద్ హరికేన్ జట్టు వైస్ కెప్టెన్‌గా రంగుండ్లవాసి

సురేశ్

తిరుమలగిరి(సాగర్), మే 24: ఇండియన్ వీల్‌చైర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీల్లో పాల్గొనే హైదరాబాద్ హరికేన్ జట్టుకు మండలంలోని రంగుండ్లతండాకు చెందిన దివ్యాంగుడు ధరావత్ సురేశ్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. జూన్ 8 నుంచి 14 వరకు ఢిల్లీలోని బాల భవన్ ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహించే ప్రీమియర్ లీగ్ పోటీల్లో హైదరాబాద్ జట్టు తరపున సురేశ్ ఆడనున్నారు. మారుమూల తండాకు చెందిన సురేశ్ వీల్ చైర్ క్రికెట్‌లో జాతీయ స్థాయిలో రాణిస్తుండడంపై తల్లిదండ్రులు, తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్యాన్సీ నంబర్‌కు రూ.3,50,999

- టీజీ 29ఏ 9999 నంబర్‌కు చెల్లించిన కోదాడ వాసి

తన కారు వద్ద రామినేని శ్రీనివాస్ రావు

కోదాడ టౌన్, మే 24 : వాహనాల ఫ్యాన్సీ నంబర్ కోసం వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. ప్రత్యేక గుర్తింపు కోసం కొందరు, సెంటిమెంట్ కోసం మరికొందరు తమకు కలిసి వచ్చే నంబర్లను పొందుతున్నారు. కోదాడ పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ చైర్మన్ రామినేని శ్రీనివాస్‌రావు ఇటీవల నూతనంగా కొనుగోలు చేసిన తన టయోటా ఫార్చునర్ లెజెండ్ కారు నంబర్ కోసం రూ.3,50,999 చెల్లించారు. శనివారం కోదాడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో టీజీ 29ఏ 9999 నంబర్‌కు రికార్డు స్థాయిలో డబ్బులు ప్రభుత్వానికి చెల్లించి దక్కించుకున్నారు.

ఎడమ కాల్వ కింద.. సాగు రంది

- నిధులకు ప్రతిపాదనలు పంపినా విడుదలలో జాప్యం
- మే, జూన్‌లోనే చేయాల్సిన అత్యవసర మరమ్మతులు
- ఏడాదిన్నరగా మరమ్మతులు లేక కోతకు గురైన కాల్వలు
- గతేడాది గండ్లు పడి చివరి భూములకు నీళ్లు అందక రైతుల ఇబ్బందులు
- వెంటనే మరమ్మతులు చేయాలంటున్న అన్నదాతలు

సాగర్ కాల్వల మరమ్మతులను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

మిర్యాలగూడ, మే 24 : నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు దాని కింద ఉన్న మేజర్, మైనర్ కాల్వలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో వచ్చే వానకాలంలో పంటలకు సాగు నీరు అందుతుందా లేదా అని అన్నదాతల్లో దిగులు మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎడమ కాల్వకు, మేజర్, మైనర్ కాల్వల మరమ్మతులకు నిధులు విడుదల చేయడం లేదు. దాంతో కాల్వలు అస్తవ్యస్తంగా మారి చివరి భూములకు నీరు అందని పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్ హయాంలో యాసంగి పంటలు అయిపోయి, కాల్వలకు నీరు ఆపగానే ఎడమకాల్వ, మేజర్, మైనర్ కాల్వలకు కావాల్సిన మరమ్మతుల ప్రపోజల్స్ తీసుకొని వెంటనే నిధులు మంజూరు చేసేది. ఆ తర్వాత యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించేవారు. నాడు ప్రభుత్వ ముందుచూపుతో 2014 నుంచి 2023 వరకు 18 పర్యాయాలు ఎడమ కాల్వ కింద రైతులకు నీటి ఇబ్బంది రాలేదు. గత ప్రభుత్వం కారణంగానే ఎడమకాల్వ కింద స్థిరీకరరించిన ఆయకట్టు అంటే ఎక్కువగా పంటలు సాగులోకి వచ్చాయి.

ప్రతిపాదనలు పంపినా రాని నిధులు

ఏడాదిన్నర కాలంగా ప్రధాన కాల్వ మరమ్మతులకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల గత వానకాలం, యాసంగిలో రైతులు ఇబ్బంది పడ్డారు. కాల్వలకు గండ్లు చివరి భూములకు నీళ్లు రాక పంటలు ఎండిపోయాయి. నాట్లు వేయాల్సిన రైతులు నార్లు ఎండిపోయి ఆర్థికంగా నష్టపోయారు. దీనివల్ల పంటల దిగుబడులు చాలా తగ్గిపోయాయి. ఇటీవల రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మిర్యాలగూడలో నీటిపారుదల శాఖ అధికారులతో రివ్యూ నిర్వహించి కాల్వల మరమ్మతుల కోసం నిధులు అవసరమని తేల్చారు. దీంతో అధికారులు మరమ్మతుల కోసం ప్రపోజల్స్ తయారు చేసి పంపించినట్లు తెలిపారు. కానీ ఇంతవరకు మరమ్మతులకు నిధుల విడుదల కాలేదు. ఒకవైపు వానకాలం ప్రారంభమైందని, సమయం అయిపోయిన తర్వాత నిధులు విడుదల చేసినా ఫలితం ఉండదని రైతులు చెబుతున్నారు.

భారీగా కోతకు గురైన కాల్వలు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎడమ కాల్వ, మేజర్, మైనర్ కాల్వలకు మరమ్మతులు చేపట్టకపోవడంతో కాల్వలు కోతకు గురై గండ్లు పడ్డాయి. ఎడమకాల్వ నాగార్జునసాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల పరిధిలో పలు చోట్ల లైనింగ్‌లు జారిపోయాయి. కొన్ని చోట్ల మేజర్ తూముల వద్ద కోతకు గురై ఉంది. షట్టర్లు సరిగా పనిచేయక కొన్నిచోట్ల తూములకు గండ్లు పడి సాగు నీరు వృథాగా పోయే పరిస్థితి ఉంది. దాంతో ఎడమ కాల్వకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసే పరిస్థితి లేకుండా పోయింది. నీటిని ఎక్కువగా వదిలితే గండ్లు పడి పంటలు మునిగే ప్రమాదం ఉంది. ప్రతియేటా మేజర్, మైనర్ కాల్వలకు మే, జూన్ మాసాల్లో అత్యవసర మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కాల్వలపై దృష్టిపెట్టినట్లు కనిపించడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా అత్యవసర పనులకైనా నిధులను విడుదల చేసి మరమ్మతులను నిర్వహిస్తేనే చివరి భూములకు సాగునీరు అందుతుందని రైతులు పేర్కొంటున్నారు.

శెట్టిపాలెం వద్ద లైనింగ్ జారిపోయి అధ్వానంగా ఉన్న ఎడమకాల్వ

వెంటనే మరమ్మతులు చేయాలి

సాగర్ కాల్వలకు మరమ్మతులు నిర్వహిస్తేనే చివరి భూములకు సక్రమంగా సాగు నీరు అందుతుంది. ప్రధాన కాల్వ కట్టలు బలహీనంగా మారిన చోట గండ్లు పడే పరిస్థితి ఉంది. మరమ్మతులు చేయకపోతే ఎప్పుడు కోతకు గురవుతాయోనని భయంగా ఉంది. మే, జూన్ నెలల్లోనే మరమ్మతులు పూర్తి చేస్తేనే రైతులకు ప్రయోజనం ఉంటుంది. ఆ తర్వాత నిధులు ఇచ్చినా పనులు చేపట్టే పరిస్థితి ఉండదు.

– పి.యాదగిరి, రైతు, మిర్యాలగూడ

సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు వివరాలు

స్థిరీకరించింది –2,83,935 ఎకరాలు
42 ఎత్తిపోతల పథకాల కింద – 86,112 ఎకరాలు
మొత్తం – 3,70,047 ఎకరాలు

కోతకు గురైన ముల్కల కాల్వ మేజర్ కాల్వ

వేములపల్లి మండలం అన్నపురెడ్డిగూడెం ఎల్–11 తూము వద్ద కోతకు గురవుతున్న ఎడమ కాల్వ కట్ట

గండ్లు పడి పంటలు మునిగాయి

సాగర్ ఎడమకాల్వకు ప్రతి సంవత్సరం అత్యవసర మరమ్మతులు నిర్వహిస్తారు. కానీ ఏడాదిన్నరగా కాంగ్రెస్ ప్రభుత్వం మరమ్మతులకు నిధులు విడుదల చేయలేదు. దాంతో కాల్వకు గండ్లు పడి పంట పొలాలకు తీవ్రంగా నష్టం జరుగుతున్నది. పోయిన వానకాలం కాల్వకు రెండు సార్లు గండిపడి పంటలు మునిగాయి. నాట్లు పెట్టినాక 15, 20 రోజుల దాకా నీళ్లు రాకపోవడంతో నాట్లు ఎండిపోయాయి. దీనివల్ల పంటల దిగుబడి భారీగా తగ్గింది. పంట పెట్టుబడులు ఎల్లక అప్పులే మిగిలాయి. ప్రభుత్వం ముందు చూపుతో మరమ్మతులు చేస్తే రైతులకు ఇబ్బందులు లేకుండా ఉండేవి.

–బంటు శ్రీను, రైతు, శెట్టిపాలెం

టీజీ పాలిసెట్‌లో మెరిసిన మనోళ్లు

- సూర్యాపేట జిల్లా అమ్మాయికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్
- వందలోపు ఏడు ర్యాంకులు సాధించిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

గంజి వాగ్దేవి

గంజి హర్ష సిద్ధార్థ

రామగిరి/యాదగిరి గుట్ట, మే 24 : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీజీ పాలిసెట్–2025 పరీక్ష ఫలితాలను తెలంగాణ సాంకేతిక విద్యా మండలి శనివారం విడుదల చేసింది. ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. సూర్యాపేట జిల్లా మిర్యాల గ్రామానికి చెందిన గౌరుగంటి శ్రీజ రాష్ట్రంలో మొదటి ర్యాంక్ సాధించింది. ఉమ్మడి జిల్లాలో పదిలోపు రెండు, 20లోపు ఒకటి, 100లోపు ఆరు ర్యాంకులు సాధించారు. నల్లగొండ జిల్లాలో 4,766 మంది పరీక్షకు హాజరుకాగా 3,935మంది, సూర్యాపేట జిల్లాలో 2,911 మందికి 2,432మంది, యాదాద్రి భువనగిరి జిల్లాలో 1,664 మందికి 1,347మంది ఉత్తీర్ణత సాధించారు.

ఉత్తమ ర్యాంకులు సాధించిన వారు..

నల్లగొండ జిల్లాలో..

- గంజి హర్ష సిద్ధార్థ(శివాజీనగర్, నల్లగొండ) –14
- గంజి వాగ్దేవి, (నల్లగొండ)–51
- శ్రీలం కార్తీక (బొర్రాయిపాలెం, అన్నారం)–53
- పెరుమాళ్ల సాయి సాహితీ(మంగళపల్లి, నకిరేకల్)–59
- చెర్వుపల్లి చర్విత మణి (మిర్యాలగూడ)–129

సూర్యాపేట జిల్లాలో..

- గౌరుగంటి శ్రీజ (మిర్యాల)–1
- షేక్ ఇర్ఫా తహసీం(భవానీనగర్, కోదాడ)–5
- బుర్యా పావని (శ్రీరాంనగర్, సూర్యాపేట) –9

యాదాద్రి భువనగిరి జిల్లాలో ..

- గొట్టిపాముల సాయిమేఘన (రఘునాథ్‌పురం)–24
- గుడిగ దీపిక –60
- తోటకూర వైష్ణవి (రాంనగర్, భువనగిరి)–75
- సారబాబు సాయి నీరజ్, (గంజ్, భువనగిరి)– 222

గుండాల పీఏసీఎస్ పాలకవర్గానికి డీసీఓ నోటీసులు

- సుద్దాల పెట్రోల్ బంక్ నిర్మాణంపై వచ్చిన అభియోగాలపై జారీ
- రాతపూర్వక వివరణ ఇచ్చిన పలువురు డైరెక్టర్లు

గుండాల, మే 24 : యాదాద్రి భువనగిరి జిల్లా డీసీఓ జి.మురళీరమణ గుండాల పీఏసీఎస్ పాలకవర్గానికి శుక్రవారం నోటీసులు జారీ చేశారు. పీఏసీఎస్ పరిధిలో సుద్దాల గ్రామంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్మాణంపై వచ్చిన అభియోగాల విషయంలో చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు 11 మంది డైరెక్టర్లకు నోటీసులు ఇచ్చారు. సుద్దాల గ్రామంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ నిర్మాణంలో సహకారం చట్టం–1964లోని సెక్షన్ 21(ఎ)(డి) రూల్ 24(1)(సి) నియమ నిబంధలను పాటించలేదని డీసీఓ నోటీసులో పేర్కొన్నారు. సుద్దాల గ్రామంలో నిర్మించే పెట్రోల్ బంక్ నిర్మాణం, సివిల్ వర్క్‌ను సహకార చట్టానికి విరుద్ధంగా పాలకవర్గం 2023 డిసెంబర్ 27న పాలకవర్గ సభ్యుడైన ఎగమాటి విద్యాసాగర్‌రెడ్డికి లక్షల విలువజేసే కాంట్రాక్టును కట్టబెడుతూ తీర్మానం చేశారు. సహకార చట్టం ప్రకారం పాలకవర్గ సభ్యులు సంఘం ద్వారా నిర్వహించే ఎటువంటి లావాదేవీల్లో ఒప్పందం చేసుకోకూడదని, స్వయంగా పనులను చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ ఉల్లంఘించి తీర్మానం చేసినట్లు నోటీసులో పొందుపర్చారు. మోత్కూర్ సహకార సంఘ ఇన్‌స్పెక్టర్, ఫీల్డ్ అధికారి విచారణ జరిపి గుండాల పీఏసీఎస్ రికార్డులను పరిశీలించగా నిబంధల ఉల్లంఘన జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణ కావడంతో పర్సన్ ఇన్‌చార్జి చైర్మన్ లింగాల భిక్షం, పర్సన్ ఇన్‌చార్జి సభ్యులు పురుగుల యాదలక్ష్మి, మందడి రామకృష్ణారెడ్డి, జంపాల కొమురయ్య, పొన్నగాని అంజయ్య, బండారి శ్రీనివాస్, ఎగమాటి విద్యాసాగర్‌రెడ్డి, చాడ పెంటమ్మ, సంగి పెద్ద బాలకొమురయ్య, అంగిడి బక్కయ్య, సింగారం ఉప్పలయ్య, గోల్కొండ సువర్ణ, పాలడుగు చిన్న అయిలయ్యకు నోటీసులు అందజేశారు. నోటీసులను సభ్యులకు అందించి వారి సంజాయిషీని మూడు రోజుల వ్యవధిలో డీసీఓ కార్యాలయానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని డీసీఓ మురళీరమణ గుండాల పీఏసీఎస్ సీఈఓ నాగయ్యను ఆదేశించారు. దాంతో శనివారం పలువురు డైరెక్టర్లు తమ వివరణ లేఖలను డీసీఓ కార్యాలయంలో అందజేశారు. పలువురు డైరెక్టర్లు వారి వివరణ లేఖలో సంఘం సభ్యుడిగా ఉంటూ కాంట్రాక్టు పనులు నేరుగా చేయవద్దన్న విషయం తమకు తెలియదని, సీఈఓ నాగయ్య తమకు నియమ నిబంధనలు చెప్పకుండానే తీర్మానం చేయించారని డీసీఓకు రాతపూర్వకంగా సంజాయిషీ ఇచ్చారు.

వేతనాలు వచ్చేదెప్పుడో ..!

- కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల కష్టాలు
- నాలుగు నెలలుగా జీతం అందక ఇక్కట్లు
- సర్వీస్ పునరుద్ధరణపైనా నీలినీడలు

నేరేడుచర్ల, మే 24 : 2008 సంవత్సరంలో పలువురు డీఎస్సీ అర్హత సాధించారు. రకరకాల కారణాలతో పోస్టింగ్ ఇవ్వడం ఆలస్యం జరిగింది. సుమారు 15 ఏండ్ల తర్వాత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కానీ కాంట్రాక్ట్ పద్ధతిలోనే నియామకాలు చేపట్టారు. అయినా ప్రభుత్వం నుంచి అందే వేతనాలు కావడంతో జీవనానికి భరోసా ఉంటుందని ఎంతో ఆశతో భావించారు. దీంతో అప్పటి వరకు చేస్తున్న ఉద్యోగాలు మాని ఉపాధ్యాయులగా విధుల్లో చేరారు. కానీ ఒక్కటి కాదు రెండు కాదు.. నాలుగు నెలలైనా వచ్చే అరకొర వేతనం కూడా చెల్లించకపోవడంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. అన్నింటికీ సర్దుకుపోతున్నా తమకు అందాల్సిన వేతనాల్లో జాప్యం చేయడంపై కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో 49 మంది

సూర్యాపేట జిల్లాలో 2008 డీఎస్సీ అర్హత సాధించిన 49 మంది అభ్యర్థులను 16 ఏండ్ల తర్వాత ఈ ఏడాది ఫిబ్రవరి 15న విధుల్లోకి తీసుకున్నారు. మండలానికి ఒక్కరు లేదా ఇద్దరికి చొప్పున పోస్టింగ్ ఇచ్చారు. వీరు జిల్లాలోని వివిధ పాఠశాలలో పాఠాలు బోధిస్తున్నారు. నాలుగు నెలల పాటు ఉంటున్న ప్రాంతం నుంచి పాఠశాలకు వెళ్లి వచ్చినా నెలనెలా వేతనాలు మాత్రం రావడం లేదు. ఇదంతా పక్కన పెడితే విద్యా సంవత్సరం చివరిలో ఆయా ఉపాధ్యాయులను టెర్మినేట్ చేసిన విద్యాశాఖ వేతనాల జారీలో మాత్రం జాప్యం చేస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. వేతనాల విషయమై స్పష్టత ఇవ్వలేకపోతున్నప్పటికీ మళ్లీ పాఠశాలలు తెరవగానే వారిని విధుల్లోకి తీసుకునే అవకాశముందని చెబుతుండడంతో కొంత మేర ఊరట కలిగిస్తున్నది.

కుటుంబ పోషణ భారంగా..

డీఎస్సీలో అర్హత సాధించి 16 ఏండ్ల తర్వాత ఉపాధ్యాయులుగా ఉద్యోగంలో చేరిన సంతోషం ఎన్నో రోజులు ఉండలేదు. ఎంతో ఆశతో ఉద్యోగాలు చేస్తున్నప్పటికీ వారికి మాత్రం వేతనాలు ఇవ్వడం లేదు. దీంతో ఒక్కొకరికి నాలుగుల నేలల వేతనాలు రావాలి. సక్రమంగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కనీసం ఇంట్లో వంట సరుకులు సైతం తెచ్చుకోలేని పరిస్థితి ఉందని పలువురు కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సరైన నిర్ణయం తీసుకొని పెండింగ్ వేతనాలు మొత్తం ఒకేసారి విడుదల చేయాలని కోరుతున్నారు.

డిగ్రీ పరీక్షల్లో 15 మంది డిబార్

రామగిరి, మే 24: ఎంజీయూ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న డిగ్రీ వివిధ సెమిస్టర్ పరీక్షల్లో శనివారం 15 మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ డిబార్ అయ్యారు. ఉదయం జరిగిన 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు 2,058 మంది హాజరుకావాల్సి ఉండగా 1,898 మంది హాజరుకాగా 152 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షల్లో నల్లగొండ కాకతీయ డిగ్రీ కళాశాల, కోదాడలోని త్రివేణి కళాశాల, సూర్యాపేటలోని ఆర్‌కేఎల్‌కే కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున, రాకేశ్ బీఈడీ కళాశాలలో ఐదుగురు డిబార్ అయ్యారు. మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షకు 1,179 మంది విద్యార్థులకు గానూ 1,027 మంది హాజరుకాగా 145 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలో ఏడుగురు డిబార్ అయ్యారు. వీరిలో నల్లగొండ కాకతీయ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడ కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సూర్యాపేట ఆర్‌కేఎల్‌కే కళాశాల భారతి డిగ్రీ కళాశాల దేవరకొండ, భువనగిరి ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున, రాకేశ్ బీఈడీ కళాశాలలో ఇద్దరు డిబార్ అయ్యారు.

ఆత్మకూర్.ఎస్: ఏనుబాములలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- కాంటాలు వేయడం లేదు.. లారీలు రావడం లేదు
- వర్షానికి తడుస్తున్న ధాన్యం ఆందోళనలో రైతులు

అర్వపల్లి, మే 24: మండల పరిధిలోని బొల్లంపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 20 రోజులు అవుతున్నప్పటికీ లారీలు రావడం లేదనే నెపంతో కాంటాలు వేయడం లేదని వాపోతున్నారు. వర్షాలు ప్రారంభమైతే ఆరుగాలం కష్టపడి పండించిన పంట పాడవుతుందని అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. యాసంగి సీజన్‌లో మండలంలో 25 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే, ఏ ఒక్క కేంద్రంలో కూడా కొనుగోళ్లు సక్రమంగా జరుగక రైతులు నెలల తరబడి పడిగాపులు కాస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరగా ధాన్యం కొనుగోలు చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆత్మకూర్.ఎస్: మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనె సంచులు లేవని, ధాన్యం లోడింగ్ కోసం లారీలు రావడం లేదని నిర్వాహకులు చెబుతుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా తమకు కావాల్సిన వారి ధాన్యాన్నే ముందుగా కొనుగోలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. చిన్నకారు రైతుల ధాన్యం రెండు నెలలైనా కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లపై తగిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

అర్వపల్లి: బొల్లెంపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాసులు

తెలుగు సబ్జెక్టులో క్రెడిట్స్ తగ్గించొద్దని వినతి

ఎంజీయూ వీసీకి వినతి పత్రం అందిస్తున్న తెలుగు అధ్యాపకులు

రామగిరి, మే 24: మాతృభాష అయిన తెలుగు సబ్జెక్టులో యూజీసీ నిబంధనల పేరుతో ఉన్నత విద్యామండలి చూపిస్తున్న ఏపక్ష ధోరణిని విరమించుకోవాలని ఎంజీయూ, అనుబంధ కళాశాలల తెలుగు అధ్యాపకులు డిమాండ్ చేశారు. నల్లగొండలోని ఎంజీయూలో శనివారం ఎంజీయూ తెలుగు శాఖ, అనుబంధ డిగ్రీ కళాశాలల తెలుగు అధ్యాపకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ ప్రస్తుతం డిగ్రీ తెలుగులో 20 క్రెడిట్స్ ఉండగా దానిని 12కు తగ్గించడం సరికాదన్నారు. ఉన్నత విద్యామండలి నిర్ణయంతో పీజీలో అడ్మిషన్ పొందేందుకు అర్హత సాధించలేకపోతారని, మరోవైపు సెంట్రల్ యూనివర్సిటీల్లో తెలుగు అధ్యాపకులుగా అర్హత పొందే అవకాశం తగ్గే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది తెలుగు భాష స్థాయిని తగ్గించడమే అన్నారు. తక్షణమే ఉన్నత విద్యామండలి నిర్ణయం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంజీయూ తెలుగు శాఖ హెచ్ఓడీ అరుణప్రియ, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కొప్పుల అంజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.